క్లుప్తంగా

కల్లూరులో చికెన్ మేళా..

కల్లూరు: బర్డ్ ఫ్లూ సోకుతుందన్న ప్రచారం ఉన్న నేపథ్యంలో కల్లూరులో ఆదివారం రాత్రి చికెన్ మేళా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర హెచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సత్తుపల్లి బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో 2 క్వింటాళ్ల చికెన్, 2 వేల గుడ్లు మేళాలో ఉచితంగా ఏర్పాటు చేశారు. బర్డ్ ఫ్లూ పైన నిర్వాహకులు ప్రజలకు అవగాహన కల్పించారు. మార్కెటింగ్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, సాంబ చికెన్ సెంటర్ నిర్వాహకుడు సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

రోమన్ క్యాథలిక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థన చేస్తున్న మేత్రాసనం పీఠాధిపతి ప్రకాశ్

బోనకల్: మండలంలోని రావినూతల రోమన్ క్యాథలిక్ చర్చిలో ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి బిషప్ సగిలి ప్రకాశ్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం ఇతరుల తప్పులను క్షమించినప్పుడే దేవుడు మన తప్పులను క్షమిస్తాడని తెలిపారు. అనంతరం సంఘస్తులు బిషప్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విచారణ గురువులు జి.అమృతాయ్, మేడి కిరణ్‌పాల్, విజయ్, జాజిరెడ్డి, జోనాధాన్, సిస్టర్ ఆల్ఫీ, బిజిలీ తదితరులు పాల్గొన్నారు.

గుట్ట సత్తెమ్మ తల్లి తిరునాళ్లు



భక్తులకు అన్నం వడ్డిస్తున్న దయానంద్

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల గుట్టసత్తెమ్మ తల్లి తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేసి.. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు నర్సింహారావు, సుబ్బారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మధిర: ఈ నెల 27న జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న పులి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, శివరాజు సుమంత్ కోరారు. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ.. ఆదివారం మధిరలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు రమేష్, నాయకులు శ్రీహరి, కృష్ణారావు, స్వర్ణాకర్, నాగేంద్రబాబు, రామకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ మండల అధ్యక్షుడిగా బీరెల్లి

బోనకల్: తెలంగాణ జనసమితి పార్టీ బోనకల్ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన బీరెల్లి వాసు, కార్యదర్శిగా తాళ్లూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వాసు విలేకరులతో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సదర్భంగా పలువురి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొండయ్య సేవలు అభినందనీయం



దుస్తులు సేకరిస్తున్న లంకా కొండయ్య

మధిర: దాతల నుంచి సేకరించిన దుస్తులను సామాజిక సేవకుడు లంకా కొండయ్య నిరుపేదలకు అందించడం గొప్పవిషయమని, ఆయన సేవలు అభినందనీయమని ప్రముఖ వ్యాపారి చెరుకూరి నాగార్జున అన్నారు. 2012లో స్థానిక ఆజాద్ రోడ్డులో మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకును స్థాపించి ప్రజల వద్ద అదనంగా ఉన్న దుస్తులను సేకరించి పేద ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ఆయన సేవలను ప్రతీఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, కృష్ణమూర్తి, జగదీష్, నాగేశ్వరరావు, రాము, ఆనందరావు, వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ కలకలం



దిక్కుతోచని స్థితిలో పౌల్ట్రీ ఫామ్

- పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు
- భయాందోళనలో చికెన్ ప్రియులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముదిగొండ: జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టిస్తోంది. మాంసం ప్రియులు ఇష్టంగా తినే చికెన్ అంటేనే ప్రస్తుతం భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. బర్డ్‌ఫ్లూ అనే మహమ్మారి కొన్ని కోళ్లకు వచ్చి మృతి చెందడంతో మాంసం ప్రియులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కోళ్ల ఫామ్ నిర్వాహకులు నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. అధికారులు బర్డ్ ఫ్లూ మన దగ్గర లేదని చెబుతున్నప్పటికీ.. సామాజిక మాధ్యమాల్లో బర్డ్‌ఫ్లూపై లేనిపోని భయాలను సృష్టిస్తూ సాగుతున్న ప్రచారంతో ప్రజలు చికెన్ తినడం మానేశారు. దీంతో చికెన్ విక్రయాలు పెద్దగా సాగకపోవడంతో.. షాపు నిర్వాహకులు ఇతర పనులకు వెళ్లాల్సి వస్తోంది.

మండలంలోని వివరాలిలా..

ముదిగొండ మండలంలోని మొత్తం 15 కోళ్ల ఫాంలు, 17,000 కోళ్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఇంటి పెరటి కోళ్లు 59,273 ఉన్నాయి. 25 పంచాయతీల్లోని 33 గ్రామాల్లో దాదాపు వందకుపైగా చెకెన్ దుకాణాలు ఉన్నాయి. ఈ షాపుల్లో చికెన్ విక్రయాలు నిర్వహిస్తున్నారు.

నిరంతర నిఘా..

ఖమ్మం జిల్లాలో కూడా బర్డ్‌ఫ్లూ వ్యాధి రాకుండా అడ్డుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్ బోర్డర్‌లో వల్లభి చెక్‌పోస్టు వద్ద పశుసంవర్ధక శాఖ అధికారులు నిరంతరం నిఘా నిర్వహిస్తున్నారు. కోళ్లతో వచ్చే వాహనాలు, కోడి గుడ్లతో వచ్చే వాహనాలను జిల్లాలోకి రానివ్వకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నారు. అధికారులు కోళ్ల ఫామ్‌లను సందర్శించి యజమానులకు సలహాలు, సూచనలు చేస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

చేపలకు గిరాకీ..



సత్తుపల్లి మార్కెట్‌లో చేపలు కొనుగోళ్లు

సత్తుపల్లిటౌన్: బర్డ్‌ఫ్లూ ప్రభావంతో చేపలకు గిరాకీ పెరిగింది. సత్తుపల్లి మార్కెట్లో చేపలు కొనుగోలు చేసేందుకు మాంసం ప్రియులు ఆసక్తి చూపించారు. అయితే వ్యాపారులు వీటి ధరలను రూ.120 నుంచి రూ.150 వరకు పెంచటంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. చికెన్ అమ్మకాలు లేక కొన్ని దుకాణాలు మూత పడగా.. మరికొన్ని దుకాణాలు వెలవెలబోయాయి.

వైరస్ వలన కలిగే వ్యాధులు..

- కొక్కెర తెగులు, గంభోరా ఫాల్‌ఫాక్స్ వ్యాధులు.. వైరస్ వలన వ్యాపిస్తాయి.
- ఫాల్‌కలరా, ఫౌల్ టైఫాయిడ్.. బ్యాక్టీరియా వలన వ్యాపిస్తాయి.
- కాక్సిడియోసిస్.. ప్రోటోజోవా వల్ల వ్యాపిస్తుంది.
- నట్టల వ్యాధులు.. నులిపురుగుల వల్ల వ్యాపిస్తాయి.
- ఏవీఎస్ఇన్‌ఫ్లూఎంజా.. వైరల్ వ్యాధి(బర్డ్‌ఫ్లూ) వైరస్ వల్ల వ్యాపిస్తుంది.



వల్లభి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

కట్టడి చేస్తున్నాం..



వల్లభిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ బోర్డర్ చెక్ పోస్టు వద్ద పశు వైద్య సిబ్బంది, రెవెన్యూ, వైద్య సిబ్బంది, పోలీస్‌లు నిరంతరం నిఘా ఏర్పాటు చేసి ఆంధ్రా నుంచి తెలంగాణాలోకి బాయిలర్ కోళ్లు, కోడి గుడ్లు వాహనాలను రాకుండా చూస్తున్నాం. కోళ్ల ఫాం యజమానులకు వ్యాధులపై సూచనలు చేస్తున్నాం. ప్రస్తుతం మన దరగ్గర కోళ్లలో ఎలాంటి వైరస్ లేదు.

– అశోక్, మండల పశువైద్యాధికారి, ముదిగొండ

సొంత ఫామ్ ఉంది..



గత ఐదేళ్ల నుంచి సొంతంగా కోళ్ల ఫామ్ నిర్వహిస్తున్నా. ఈ ఏడిది కూడా ఫాంలోని కోళ్లు పెంచి, ఇతర దుకాణాలకు విక్రయించడంతో పాటు నా సొంత షాపులో చికెన్ విక్రయించేవాడిని. ఒక్కసారిగా వైరస్ వ్యాప్తి సోకిందని ప్రచారం నడవడంతో చికెన్ ప్రియులు కొనుగోలు చేయక నష్టం వచ్చింది. అధికారులు చెప్పినా.. జనాలు నమ్మడం లేదు.

– మీగడ శ్రీనివాస్‌యాదవ్, పౌల్ట్రీ ఫాం యజమాని, గోకినేపల్లి

చికెన్ కొనడం లేదు..



నాకు ముదిగొండలో చికెన్ షాపు ఉంది. ప్రతీ ఆదివారం సుమారు 80 నుంచి 100 కిలోలు చికెన్ అమ్మేవాళ్లం. కానీ ఇప్పుడు కనీసం నాలుగుకిలోలు కూడా అమ్ముడవని పరిస్థితి. సోషల్ మీడియాలో బర్డ్‌ఫ్లూ అంటూ ప్రచారం కొనసాగడంతో ప్రజలు చికెన్ తీనడం మానేశారు. విక్రయాలు సరిగా లేక నష్టపోవాల్సి వస్తుంది.

– ఉండేటి శ్రీనివాసరావు, చికెన్ షాపు యజమాని, ముదిగొండ

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

- కనుల పండువగా శివపార్వతుల శాంతికల్యాణం
- ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



సోమలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

తల్లాడ: మండలంలోని పినపాకలో నూతనంగా నిర్మించిన సోమలింగేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం 10:32 గంటలకు ఆలయంలో గోవింద శర్మ, కులకర్ణి నిఖిల్ దత్తా ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కన్నుల పండువగా జరిగింది. ఓం నమ: శివాయ: ఓం హర హర శంకరా అంటూ భక్తులు ఆలయం ప్రాంగణం మారుమ్రోగేలా పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం శివ పార్వతుల శాంతి కల్యాణం నిర్వహించగా.. పలు గ్రామాల భక్తులు హాజరై ధ్వజస్తంభం వద్ద నవధాన్యాలు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పదివేల మందికి మహా అన్నదానం చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఆలయ కమిటీ తరఫున శ్రీను ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు.

శంకుస్థాపన..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరురూరల్: మండలంలోని రాళ్లబంజరు(లక్ష్మీపురం) గ్రామంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ ఆలయానికి శంకుస్థాపన చేశారు. రాళ్ల బంజరుకు చెందిన గిరిజనులు విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మి, ప్రసాద్, ధర్మ, మోతీలాల్, శ్రీను, కృష్ణ, కల్లూరు ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి..

కల్లూరు: ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సత్తుపల్లి, అశ్వారావు పేట ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారే ఆదినారాయణ తెలిపారు. ఆదివారం కల్లూరు పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన కృష్ణచైతన్య ఆస్పత్రిని వారు ఖమ్మం ప్రముఖ వైద్యుడు డాక్టర్ వేము గంగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎండీ బీరవల్లి కృష్ణచైతన్యకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణమూర్తి, డాక్టర్ లక్కినేని రఘు, నిర్వాహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం..

తల్లాడ: తల్లాడలోని కొత్తగూడెం రోడ్డులో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్, నాయకులు కృష్ణారెడ్డి, రఘుపతిరెడ్డి, కిషోర్, డి.వీరారెడ్డి, శ్రీను, రమేష్, ప్రకాశరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అలనాటి గురువులతో విద్యార్థులు

కారేపల్లి: కారేపల్లి హైస్కూల్‌లో 1990–91 బ్యాచ్‌కు చెందిన పది విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 34ఏళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకొని.. చిన్ననాటి చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చీమలదారి ఉపేందర్, ఆకారపు రామారావు, యాకూబ్ అలీ, కర్నాటి భాస్కర్, కేసగాని ఉపేందర్, గౌస్‌భాయ్, మౌలానా, గణపారపు రఘు, సక్రు, అక్తర్, మల్లికార్జున్‌రావు, సాయిన్ని సైదయ్య, శివ, బాలకృష్ణ, కొమ్ము లలిత, అరుణ, వెంకటనారాయణ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తల్లాడ: తల్లాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఖమ్మం సీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

ఎకరాకు రూ.25 లక్షలు ఇవ్వాలి

14వ రోజుకు చేరిన దీక్షలు



దీక్షలో పాల్గొన్న భూ నిర్వాసితులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొమ్మేపల్లి భూ నిర్వాసితుల చేపట్టిన ఆందోళన ఆదివారం 14వ రోజుకు చేరింది. ఎకరానికి రూ.25 లక్షలు పరిహారం ఇస్తామని నమ్మబలికి సర్వేకు సహకరించిన తరువాత పరిహారం చెల్లించకుండానే భూములు లాక్కునేందుకు సింగరేణి అధికారులు తమ భూముల్లో ట్రెంచ్ కొట్టడంతో కొమ్మేపల్లి రెవెన్యూ పరిధిలో భూములకు పరిహారం అందని రైతులు ఆందోళన నిర్వహించారు. పరిహారం విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ తిరిగినా పట్టించుకోవటం లేదన్నారు. కొమ్మేపల్లి రెవెన్యూలోని 17.20 ఎకరాలకు పరిహారం ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ప్రభాకర్‌రావు, ప్రసాద్, వసుప్రధారాణి పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలించిన నాయకులు

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆళ్లపాడు మైనర్‌కు నీరందక ఎండిపోతున్న మొక్కజొన్న పంటలను ఆదివారం కాంగ్రెస్ బృందం పరిశీలించారు. రైతులు సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయని తెలుపగా.. నాయకులు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి మరో రెండ్రోజులు నీటిని అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా సకాలంలో తడులు పెట్టుకోవాలన్నారు. కొందరు రైతులు కాలువలో తాటిమొద్దులు అడ్డువేసి ఆళ్లపాడు మైనర్‌కు ఎక్కువనీరు వచ్చేలా ప్రయత్నం చేస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారావు, ఆత్మకమిటీ సభ్యులు పాపారావు, భద్రూనాయక్, జనప్రియకుమార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న చిన్నారులు

వైరా: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన తెలంగాణ గురుకుల విద్యాసంస్థలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. వైరాలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. సాంఘీక సంక్షేమ పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు రమ, మమత పర్యవేక్షించారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షల్లో 378మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 9మంది గైర్హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చావా జ్యోతి తెలిపారు. పోలీసుల బందోబస్తు నడుమ పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

ఢిల్లీ మరింత అభివృద్ధి చెందుతుంది

బోనకల్: రేఖాగుప్తా నాయకత్వంలో ఢిల్లీ మరింత అభివృద్ధి చెందుతుందని బీజేపీ మండల ఓబీసీ అధ్యక్షుడు మరీదు పరుశురాం అన్నారు. ఆదివారం బోనకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఓబీసీ సెల్ నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్రగాయాలు

కారేపల్లి: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి క్రింద పడటంతో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని గిద్దెవారిగూడెం స్టేజీ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎర్రబోడు గ్రామానికి చెందిన బానోత్ సోమ్లా ద్విచక్రవాహనంపై ఖమ్మం–ఇల్లందు ప్రధాన రహదారిపై కారేపల్లి వైపు వస్తుండగా.. గిద్దెవారిగూడెం స్టేజీ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో సోమ్లాకు తీవ్రగాయాలు కావటంతో 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మహాసభను జయప్రదం చేయండి

కొణిజర్ల: మార్చి 3న కొణిజర్లలో జరిగే తెలంగాణ రైతు సంఘం మండల మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం (సీపీఐ) జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తుమ్మలపల్లిలో ఎర్ర వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నాయకులు శ్రీనివాసరావు, సైదులు, మల్లయ్య, రాజా, నాగరాజు, సీతారాములు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ముదిగొండ: మండలంలోని మేడేపల్లికి చెందిన మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి నాగమణి శనివారం గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావులతో పాలు పలువురు నాయకులు, నేతలు పరామర్శించి నివాళులు అర్పించారు.

అంజయ్య వర్ధంతి

కొణిజర్ల: తనికెళ్లలో సీపీఐ సీనియర్ నాయకుడు మంచికంటి అంజయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు బాబు, రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

వైరా: వైరా రిజర్వాయర్ ఆనకట్ట పక్కనే ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీసీతారాముల కల్యాణ క్రతువు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ఆదిత్య శర్మ నేతృత్వంలో ఉదయం 7.30 గంటల నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర నామ పూజ, హనుమాన్ ఛాలీసా పారాయణం, భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు చావా శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకటయ్య, చింతలపూడి వెంకటేశ్వర రావు, సూతకాని జైపాల్, మాదినేని సునీత ప్రసాద్, చెరుకూరి శ్రీనివాసరావు, మన్నేపల్లి ప్రదీప్, కొత్త వెంకటేశ్వరరావు, శారద, వనమా చిన్ని, మిట్టపల్లి వెంకటరమణ, శివనాగభూషణం, ఏలూరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి జగన్మోహన రావు, ఏలూరి నరసింహారావు, బొర్రా రాజశేఖర్, కట్టా కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

భావనారుషి కల్యాణం..



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. పద్మశాలీల ఆరాధ్య దైవమైన భద్రావతి, భావనారుషి స్వామి వార్ల కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు యలమద్ది రాము, ఉద్దండయ్య, పొడుగు వెంకటేశ్వర్లు, జల్లా నరసింహారావు, రామకృష్ణ, వెంకటనారాయణ పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తదానం



రక్తదానం చేస్తున్న కారేపల్లి యువకులు

కారేపల్లి: రక్తం కొరతతో తలసేమియా వ్యాధిన పడిన చిన్నారులు ఇబ్బందులు పడుతుండటంతో.. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కారేపల్లి యువకులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ప్రొద్దుటూరు రవిచందర్ మాట్లాడుతూ.. 30మంది కారేపల్లి యువకులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. వారికి సర్టిఫికెట్లను అందజేశారు. చిన్నారులకు రక్తం కొరత రాకుండా, సమాజం వారికి అండగా నిలబడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కారేపల్లి యువకులు గంగరబోయిన మురళీ సిద్ధు, జంగా జోగిరెడ్డి, రెంటాల వినోద్, ధనుష్, రాంకీ, అనీల్, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

గుంత తీశారు.. పూడ్చుట మరిచారు



తాగునీటి సరఫరా లీకేజీ కావటంతో మరమ్మతుల కోసం తరచూ రోడ్లపై గోతులు తీస్తూ పూడ్చటంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సురేష్ సైకిల్‌షాప్ వీధి ఎదురుగా నెలలో రెండుసార్లు ఇలా భారీ గుంత తీసి వదిలేస్తున్నారని, ఈ వీధిలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.

– సత్తుపల్లిటౌన్